క్లుప్తంగా

అంజుమన్ సంస్థకు అడ్‌హక్ కమిటీ



అడ్‌హక్ కమిటీకి బాధ్యతలు అప్పగిస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని ముస్లింల అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థకు అడ్‌హక్ కమిటీ వేశారు. ఈ సంస్థకు ప్రస్తుత పాలక మండలి పదవీ కాలం దాదాపు ఏడాదిన్నర క్రితమే ముగిసింది. ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఎన్నికలు నిర్వహణపై పాలకమండలిని నిలదీయడంతో అడ్‌హక్ కమిటీ వేశారు. ప్రస్తుత పాలక మండలి అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ సులేమాన్, అమీర్ జానీలతో పాటు సంస్థ శాశ్వత సభ్యుల్లోని ఎండీ ఇబ్రహీం, రాజా అహ్మద్, రియాజ్ అలీఖాన్, ఎస్ఎం అక్బర్, ఎస్‌కే మస్తాన్ తదితర 17 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటుచేశారు. కమిటీకి ప్రస్తుతం కమిటీ సభ్యులు సోమవారం బాధ్యతలు అప్పగించారు. అడ్‌హక్ కమిటీ ప్రతినిధులు మంగళవారం సాయంత్రం సమావేశమై ఎన్నికల నిర్వహణపై నిర్ణయం తీసుకోనున్నారు.

లిడ్‌క్యాప్ ఎండీ అవినీతిపై ఫిర్యాదు

ఏలూరు (టూటౌన్): ఏపీ లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌లో ఎండీగా పనిచేస్తున్న డోలా శంకర్ అవినీతిపై రాష్ట్ర హైకోర్టు సిట్టింగ్ జడ్జి చే సమగ్రవిచారణ చేయించాలని దళితసేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ కోరారు. దళిత సేన ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఆర్డీఓ పంచల్ కిషోర్‌కు వినతి పత్రం అందజేశారు. దళితసేన నాయకులు పింగుల ఇథియా, బేతాళ జయసుధ, పింగుల విజయమ్మ, నందిపాము శ్యామల, తగరం దేవదాస్, లక్కపాము దాసు, కటారి రాట్నాలమ్మ పాల్గొన్నారు.

దైవాభిమానికి నివాళి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): క్రైస్తవ ఆధ్యాత్మిక నాయకుడు, ఐబీఎం మినిస్ట్రీస్, ఆంధ్ర బైబిల్ కాలేజ్ వ్యవస్థాపకుడు ఉన్నమట్ల దైవాభిమాని (65) ఆదివారం రాత్రి మరణించారు. ఆయన మృతి పట్ల ఎంపీ కోటగిరి శ్రీధర్, నగర మేయర్ నూర్జహాన్ పెదబాబు, రాజకీయ ప్రముఖులు నివాళులర్పించారు. దైవాభిమాని భూస్థాపిత కార్యక్రమం సోమవారం ఏలూరులో నిర్వహించారు. బిషప్‌లు ఎలీషా రాజు, జాన్ ఎస్‌డీ రాజు, కారుపాటి శాంతి సాగర్, పాస్టర్ల కౌన్సిల్ ప్రెసిడెంట్ ఎబినేజర్ శాస్త్రి, పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ అధ్యక్షుడు పీవీ రాజు, ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు జీవన్ కుమార్, జ్యోతిరాజు, ఏఆర్ పాల్సన్, ఫిన్నీ అబ్రహాం తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

ఎస్పీ మేరీ ప్రశాంతి





సమావేశానికి హాజరైన సిబ్బంది కుటుంబాలు, పోలీస్ కుటుంబాలతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: పోలీస్ శాఖలో పనిచేస్తూ అనారోగ్య కారణాలతో మృతిచెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి హామీ ఇచ్చారు. పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన సిబ్బంది కుటుంబ సభ్యులతో సోమవారం ఆమె ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ, శాఖాపరంగా ఏదైనా ఆర్థిక ప్రయోజనాలు పెండింగ్‌లో ఉన్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో ఉంటూ మృతిచెందిన అమరవీరుల కుటుంబాల్లోని అర్హత, ఆసక్తి గల పిల్లలకు కారుణ్య నియమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మృతిచెందిన సిబ్బంది కుటుంబాలకు అందాల్సిన సౌకర్యాలు, ఆర్థిక లబ్ధి, ఇతర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. సిబ్బంది కుటుంబాలకు ఇతర సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం సిబ్బందికి సంక్షేమ దివస్ నిర్వహిస్తున్నామని, సమస్య ఉంటే నేరుగా తనకు తెలియజేయాలని కోరారు. సమావేశంలో దిశ డీఎస్పీ నున్న మురళీకృష్ణ, పోలీస్ ప్రధాన కార్యాలయ ఏఓ బీవీఎస్ఆర్‌కే నాయక్, పోలీస్ అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు ఉన్నారు.

25న సీఆర్ఆర్ కాలేజీలో జాబ్ మేళా

ఏలూరు(మెట్రో): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో సీఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వట్లూరులో ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సహకారంతో దెందులూరు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత రెండు వేల మందికి ఉపాధి కల్పించేందుకు సుమారు 30 కంపెనీలతో ఉదయం 09 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు తమ బయోడేటాతో హాజరు కావాలని, పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్లు సునీల్ : 94934 82414, శ్యామ్ : 89785 24022, సత్యనారాయణ : 96663 22032లో సంప్రదించాలని వివరించారు.

దోమల నివారణపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, సిబ్బంది

ఏలూరు టౌన్: దోమల వృద్ధిని అడ్డుకునేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. ఏలూరు కొత్తపేట దాసరివారి వీధిలో న్యూ జనరేషన్ స్కూల్ విద్యార్థులకు, ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. దోమల నివారణ పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. దోమకాటుతో వచ్చే వ్యాధులు, వాటిని అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు వివరించారు. 1897 ఆగస్టు 20న బ్రిటీష్ వైద్యులు సర్ రోనాల్డ్ రాస్ అనే ఆయన ఆడ అనాఫిలిస్ దోమతో మలేరియా వ్యాధి సంక్రమిస్తుందని నిరూపించారని తెలిపారు. ఆయన పరిశోధనలతో మానవాళి మలేరియా మరణాల నుంచి కొంతవరకు తప్పించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. ఈ దోమలు ఇంటి పరిసరాల్లోని నీళ్ల తొట్టెలు, పూల కుంటీలు, ఫ్లవర్‌వాజ్‌లు, వాడి పడేసిన కొబ్బరి బొండాల్లోనూ వృద్ధి చెందుతాయని తెలిపారు. నీళ్ల తొట్లెలపై మూతలు పెట్టుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు, ఏఎస్ఎం కోటం దుర్గాదేవి, హెల్త్ అసిస్టెంట్స్ శ్రీనివాస్, రమేష్, ఆశా కార్యకర్త దేవి తదితరులు ఉన్నారు.

పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలి



పారిశ్రామికవేత్తలను సన్మానిస్తున్న సీఆర్ఆర్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయని ధరణి ఫుడ్ ఇండస్ట్రీ, ధరణి పికెల్స్ ఎక్స్ పోర్ట్స్ (అమెరికా, ఆస్ట్రేలియా) మేనేజింగ్ డైరెక్టర్ పామర్తి తిరుపతిరావు అన్నారు. స్థానిక సీఆర్ఆర్ కళాశాల సీఐఐఈ, ఈడీసీ, ఎంబీఏ, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తిరుపతిరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తోన్న పథకాల ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలు కూడా లభిస్తాయన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వివిధ పరిశ్రమల స్థాపనకు చేయూత అందిస్తున్నారని, దానిని విద్యార్థులు తెలుసుకొని పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలని సూచించారు. పరిశ్రమల స్థాపన ద్వారా ఇతరులకు ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదుగుతామని, దేశ ఆర్థిక అభివృద్ధిలో భాగస్వాములవుతామని తెలిపారు. శ్రీ ఫ్రూట్ బేవరేజెస్ మేనేజింగ్ డైరెక్టర్ ఫణీందర్ సంపంగి మాట్లాడుతు విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా పథకాల ద్వారా స్టార్టప్ పరిశ్రమలు స్థాపించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం పారిశ్రామికవేత్తలను ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేవీఎస్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, పీజీ కళాశాల డైరెక్టర్ వీఆర్ఎస్ బాబు యలమర్తి, సీఐఐఈ, ఈడీసీ కోఆర్డినేటర్ తేర రాజేష్, ఎంబీఏ డైరెక్టర్ ఆర్ శ్రీనివాసరావు, ఈడీసీ సభ్యులు, అధ్యాపకులు టి.శామ్ ప్రసాద్, ఎం ఉపేంద్ర, పీహెచ్ఎస్ఎస్‌వీ సుబ్బారావు, ఎస్ శ్రీలత, జీఆర్ సత్యనారాయణ, జీవీఎస్ రవీంద్ర బాబు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మేనేజర్ శేఖర్‌బాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గొల్లమూడి శేఖర్‌బాబు సూచించారు. నవజీవన్ బాల భవన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అశోక్ నగర్‌లోని కొండా పార్వతి దేవి థియోసాఫికల్ (కేపీడీటీ) ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తుపదార్థాల వల్ల ఆరోగ్యం క్షీణించడంతో పాటు సామాజికంగా, ఆర్థికంగా నష్టపోయి కుటుంబ సత్సంబంధాలను కోల్పోతామని తెలిపారు. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థులను సన్మార్గంలో నడిపించాలని సూచించారు. డీఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకొనిరావచ్చని, ఈ చికిత్స నవజీవన్ బాల భవన్ సంస్థ ఏలూరు జిల్లా నూజివీడులో బోస్కో డీఎడిక్షన్ సెంటర్‌లో అందిస్తుందని, సెల్ నెంబర్ 94904 92020లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కేపీడీటీ ఎయిడెడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీఎస్ ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ నవజీవన్ బాల భవన్ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినేటర్స్ డి.రజిత, బి.నేహేమియా, కె.ప్రియాంక, ఉపాధ్యాయులు బి.కమలమ్మ, కె.నాగ మునేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్‌తోనే వెనుకబడిన కులాలకు ప్రాధాన్యత



జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్న వాసుబాబు

ఉంగుటూరు : వెనుకబడిన కులాలకు గుర్తింపు తీసుకువచ్చి, వారికి ప్రాధాన్యత కల్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం కైకరం పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుబాబుతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. అంతేగాక నాలుగేళ్లలో ఏ కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ బీసీలలో 127 కులాలు వరకు ఉంటే అందులో మేజరు భాగం కులాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనని అన్నారు. బీసీలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అలాగే పేదలు ఆర్థికంగా బలపడటానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'నవరత్నాలు' సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దడంతోపాటు, ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడం, మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అమలు చేయడం, అమ్మ ఒడి పథకం అమలుతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. సచివాలయం, వలంటీరు వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకు చేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. తొలుత మహిళలు ఎమ్మెల్యే వాసుబాబుకి హారతులు పట్టి స్వాగతం పలికారు. పూలమాలలతో సత్కరించి వారి అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు పుప్పాల గోపి, కొరిపల్లి శ్రీను, నక్కా శ్రీను, మంద జయలక్ష్మి, మరడ మంగరావు, పెనుగొండ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బందిపై కాంట్రాక్టర్ దాడి



కృష్ణా కాలువలో చెత్త వేసేందుకు వచ్చిన ట్రాక్టర్

ఏలూరు టౌన్: నగరపాలక సంస్థ క్లీన్ ఏలూరుగా తీర్చిదిద్దేందుకు అనేక అభివృద్ధి పనులు చేస్తుండగా కొందరు వ్యక్తులు పరిసరాల పరిశుభ్రత పాటించకుండా తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు. ఏలూరు మినీబైపాస్ రోడ్డు గ్రీన్‌సిటీ ప్రాంతంలో ఒక కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో ట్రాక్టర్‌లో చెత్త, వ్యర్థాలను తీసుకొచ్చి కృష్ణా కాలువలో వేసేందుకు ప్రయత్నిస్తుండగా నగరపాలక సంస్థ శానిటేషన్ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో కాంట్రాక్టర్ ఆగ్రహంతో శానిటేషన్ సిబ్బందిపై దాడికి ప్రయత్నించారు. సిబ్బందిని కించపరిచేలా వ్యాఖ్యానించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, డివిజన్ ఇన్‌చార్జి గూడూరి ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. కృష్ణా కాలువలో చెత్తవేయటాన్ని చూసి నిలదీశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శానిటేషన్ సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	42	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	60-96
వంకాయలు (కాంతులు)	36	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	05-08
బెండకాయలు	24	కంద	36
పచ్చిమిర్చి	50-60	బీట్‌రూట్	36
కాకర కాయలు	44-54	కీరా దోస	40
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	72
బీరకాయలు (పందిరి)	50	అల్లం	120-220
క్యాబేజీ	32	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	36	పాలకూర	10
దొండకాయలు	40	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	30	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణీ	--
అనబకాయ (1)	15	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	36
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	19
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	31
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	08.00	4794	--
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	--
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలి

ఏలూరు (టూటౌన్) : ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. స్థానిక పాతబస్టాండ్‌సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. జీఓ 26 ప్రకారం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ కొనసాగించాలని, రాష్ట్రంలో నిలిచిపోయిన ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు బేతాళ సుదర్శనం, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ ఎ.సర్వేశ్వరరావు, వైస్ చైర్మన్ గుగ్గులోతు కృష్ణ, గంజి మధుసూదన్ రావు, కార్యదర్శి పంతగాని రమేష్ పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత రాయన్నపాలెం జట్టు

పెదవేగి : వాల్‌బాల్ టోర్నీలో రాయన్నపాలెం జట్టు విజయకేతనం ఎగురవేసింది. పెదవేగి మండలం రాయన్నపాలెంలో అబ్బయ్యచౌదరి వాలీబాల్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం ఫైనల్ మ్యాచ్‌లో కూచింపూడి జట్టు రాయన్నపాలెం జట్టు పోటీపడ్డాయి. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు. మొదటిస్థానంలో నిలిచి ట్రోఫీ సాధించిన రాయన్నపాలెం టీమ్‌కు ఎమ్మెల్యే రూ.20 వేలు అందజేశారు.

వీరమ్మకుంట నూతన సర్పంచ్‌కు సత్కారం



వీరమ్మకుంట సర్పంచ్‌ను సత్కరించిన ఎమ్మెల్యే, నాయకులు

పెదవేగి : వీరమ్మకుంట ఉప ఎన్నికల్లో విజయం ఎంతో ప్రతిష్టాత్మకమని, పంచాయతీ అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సూచించారు. సోమవారం పెదవేగి మండలం కొండలరావుపాలెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొఠారు రామచంద్రరావులను వీరమ్మకుంట సర్పంచ్‌గా ఎన్నికైన మరడాని వెంకట లక్ష్మణ సోమేశ్వరరావు (చంటి), గ్రామ ప్రజలు, పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరికి సర్పంచ్ చంటి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్న ప్రభుత్వంలో ప్రజలకు సేవ చేయడం గొప్ప అదృష్టమని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంటిని దుశ్శాలువాతో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, పెద్దలు కొఠారు రామచంద్రరావు, జిల్లా బీసీ సంఘ నేత ఘంటా ప్రసాద్ తదితరులు సత్కరించారు. పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల వ్యాను సీజ్



గుడిపాడులో కోళ్ల వ్యర్థాల వ్యానును స్వాధీనం చేసుకున్న ఎస్సై చల్లా కృష్ణ

పెదపాడు : కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వ్యాన్‌ను సీజ్ చేసినట్టు పోలీసులు తెలిపారు. పెదపాడు మండలం గుడిపాడు గ్రామానికి కోళ్ల వ్యర్థాలు తరలిస్తుండగా వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు. వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని, చేపల చెరువు యజమానిపైనా కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

రేషన్ షాపులపై ఫిర్యాదు

దెందులూరు: దెందులూరులోని 33, 34 రేషన్ డిపోలను విచారణచేసి, ఆ షాపులను అర్హులకిచ్చి నిత్యావసర సరుకులు సకాలంలో లబ్ధిదారులకు సక్రమంగా అందేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని చల్లా మేరీ రాజు సోమవారం ఏలూరు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్‌కు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. సరుకుల పంపిణీలో ఫిర్యాదులు, ఇతర విషయాలను దృష్టిలో పెట్టుకుని ఆ షాపులపై మంచి నిర్ణయం తీసుకోవాలని రాజు కోరారు.

కొత్త కాలనీలో సదుపాయాలు కల్పించాలి

పెదవేగి : మండలంలోని భోగాపురం గ్రామ పంచాయతీ ప్రకాష్ నగర్ కొత్త కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అధికారులను కోరారు. సర్పంచ్ దిమ్మిటి నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సోమవారం కొత్త కాలనీలో పర్యటించారు. కొత్త కాలనీలో విద్యుత్, రోడ్లు, డ్రెయినేజీ, నీటి పంపులు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే వెంట భోగాపురం గ్రామ నాయకులు దిమ్మిటి రమేష్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట బాబు, ఆళ్ల సతీష్ చౌదరి, కొప్పాక సొసైటీ అధ్యక్షుడు చల్లగొళ్ల భూస్వామి, మేడికొండ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

పెదవేగి : ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచి ఆదుకుంటానని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం పెదవేగి మండలం న్యాయంపల్లి గ్రామంలో మరణించిన బొబ్బారి మంగయ్య మృతదేహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10 వేలు అందించారు. అనంతరం న్యాయంపల్లి గ్రామంలో మాజీ ఎంపీటీసీ చింతపల్లి సత్యనారాయణ సోదరుడు ఇటీవల మరణించగా ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి రూ.10 వేలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.